లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినార్ హాలులో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఎస్టీ వర్గీకరణ సమస్యలు సవాళ్లు అనే అంశంపై చర్చగోష్టి జరిగింది. కార్యక్రమానికి ఓయూ ఆదివాసీ పరిశోధక విద్యార్థి సొగబోయిన పాపారావు అధ్యక్షత వహించగా ఆదివాసీ ప్రొ.ఆప్కా నాగేశ్వర్‌రావు, ఆదివాసీ హక్కుల పోరాట సమితి, డుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ అరుణ్‌కుమార్, వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి సిద్దబోయిన లక్ష్మీనారాయణ, ఆదివాసీ అడ్వకేట్ అసోసియేషన్ అరెం పాపారావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. నాగరికథ జీవనానికి దూరంగా అడవుల్లో నివసిస్తున్న ఆదివాసీలు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎస్టీలకు కల్పించిన రిజర్వేషన్లు ఆదివాసీలు అందుకోలేక విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కోల్పోతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఆదివాసీల అభివృద్ధికి అడ్డుగా ఉన్న లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసి ఉద్యమ నేతలు కోటేశ్వర్‌రావు, వివేక్, హేమంతురావు, సుభాష్‌చంద్ర, చంటి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జలమండలి జీఎం ఆకస్మిక తనిఖీ


మ్యానుహోల్స్‌ను పరిశీలిస్తున్న జలమండలి జీఎం వినోద్‌కుమార్

బన్సీలాల్‌పేట్: జలమండలి జీఎం వినోద్‌కుమార్ ఆదివారం మారేడ్‌పల్లి జలమండలి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. కుండపోతగా కురుస్తున్న వర్షాల కారణంగా ఎక్కడ కూడా మ్యాన్ హోల్స్ పొంగిపొర్లకుండా రోడ్లపై నీళ్లు నిలవకుండా చూడాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. వర్షాల కారణంగా వరదనీటితో ప్రజలు ఇబ్బంది పడకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితిని తెలుసుకొని సమస్యలను పరిష్కరించడానికి ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్లు జీఎం వినోద్‌కుమార్ చెప్పారు. శ్రీనివాస్ నగర్, హుస్సేన్‌సాగర్ పంప్ హౌస్, బోయిగూడ, మారేడ్‌పల్లి, లాలాపేట్, నల్లగుట్ట, రెజిమెంటల్ బజార్ తదితర ప్రాంతాల్లో పర్యటించినట్లు తెలియజేశారు. కుండపోతగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా సెక్షన్ మేనేజర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. తమ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉన్నారన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్య ఉత్పన్నమైనా వెంటనే అక్కడికి చేరుకొని సమస్యను పరిష్కరిస్తారన్నారు. ముఖ్యంగా మ్యానుహోల్స్ పొంగిపొర్లకుండా సదరు సిబ్బంది అప్రమత్తం చేశామన్నారు.

నేడు ఓయూకు సెలవు

ఉస్మానియా యూనివర్సిటీ: నేడు (2న) ఓయూ క్యాంపస్‌తో పాటు అనుబంధ కాలేజీలు, ఎగ్జామినేషన్ బ్రాంచ్, ఇతర కార్యాలయాలకు సెలవు ప్రకటించారు. వర్షాల కారణంగా అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు విజ్ఞప్తి మేరకు సోమవారం ఒక్క (నేడు) సెలవు ప్రకటించినట్లు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అవసరం ఉంటే తప్ప రాత్రి సమయంలో క్యాంపస్‌లోని హాస్టల్ విద్యార్థులు బయటకు రావద్దు అని సూచించారు. తిరిగి రేపు (3న) యథావిధిగా వర్సిటీ కార్యాకలపాలు కొనసాగుతాయన్నారు.

రేపు ప్రత్యేక పూజలు

అడ్డగుట్ట: శ్రావణమాస చివరి రోజును పురస్కరించుకొని మంగళవారం తుకారాంగేట్‌లోని పహాడీ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి వెంకటరమణ తెలిపారు. ఆ రోజు అమావాస్య కూడా కలిసి రావడం ఎంతో విశేషం అని అన్నారు. తెల్లవారుజాము నుంచే ఆంజనేయ స్వామి వారికి పంచామృతం, వెన్నతో అభిషేకాలు, సింధూరం, ఆకుపూజ ఉంటుందని తెలిపారు.

కుల గణన వెంటనే చేపట్టాలి

లాలాపేట: తెలంగాణలో కుల గణన చేయడానికి ఓ కమిటీని ఏర్పాటు చేసి దాని ద్వారా కార్యాచరణ ప్రారంభించాలని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ గోధుమల కుమారస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులో మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం 42 శాతం ఉన్న బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్ ఉండాలన్నారు. అందుకుగాను వెంటనే కుల గణన చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసిలకు న్యాయం చేయాలనీ కోరుతూ అమరణ దీక్ష చేస్తున్న బత్తుల సిద్దేశ్వర్, రాజారామ్ యాదవ్, ఆజాది.చాపర్తి కుమార్ గాడ్గెలకు సంపూర్ణ మద్దతు తెలియజేశారు.

4న నిరసన దీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: విభజించి పాలించడం మనువాదులు ఎత్తుగడలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్ ఆదివారం పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ పై గతంలో సుప్రీమ్ కోర్టు ఇచ్చిన తీర్పును బీజేపీ ప్రభుత్వం గౌరవించకుండా దళితులను విడదీసిందన్నారు. రిజర్వేషన్లు లేకుండా చేసేందుకు ఒక పక్క ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ మరోపక్క రిజర్వేషన్ల విభజన పేరుతో దళితుల నడుమ చిచ్చుపెడుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 4న తెలంగాణలోని 33 జిల్లాల కలెక్టరేట్ల ఎదుట మాలల నిరసన దీక్షలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

నగరంలోకి భారీ వాహనాలు నిషేధం


ఓయూ పీఎస్ వద్ద బారులు తీరిన భారీ వాహనాలు లారీలు

లాలాపేట: వరుస రోడ్డు ప్రమాదాలతో నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తమయ్యారు. గత రెండు రోజుల నుంచి తార్నాక, హబ్సిగూడ ప్రధాన రహదారిలో నిబంధనలకు విరుద్ధంగా నగరంలోకి వస్తున్న పలు లారీలు, భారీ వాహనాలపై కొరడా ఝుళిపించారు. దాదాపు 50 వరకు వాహనాలను పట్టుకుని ఓయూ పీఎస్‌కు తరలించారు. లా అండ్ ఆర్డర్ పోలీసుల ద్వారా వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా నల్లకుంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు మాట్లాడుతూ వరుస ప్రమాదాల నేపథ్యంలో ఉదయం 7 గంటల నుంచి రాతి 11 గంటల వరకు నగరంలోకి భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తున్నట్లు తెలియజేశారు. ఏవైనా ఎమర్జెన్సీ వాహనాలు మినహా ఎలాంటి భారీ వాహనాలు నగరంలోకి రావద్దని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

జనజీవనం అస్తవ్యస్తం


బల్కంపేట సుప్రభాతనగర్‌లో రోడ్డుకు అడ్డంగా ఒరిగిన చెట్టు..




వర్షంలో ప్రజల అవస్థలు...





సనత్‌నగర్: ఎడతెరిపి లేకుండా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జనజీవనం అతలాకుతలమైంది. రహదారులన్నీ గోదారులుగా మారాయి. ఈదురుగాలులతో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. దీంతో కరెంటు సరఫరా గంటల తరబడి నిలిచిపోవడంతో జనం అవస్థలు పడ్డారు. బేగంపేట ప్రధాన రహదారితో పాటు మయూరి మార్గ్, అల్లంతోటబావి, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, బ్రాహ్మణవాడీ, ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ తదితర ప్రాంతాల్లో వరదనీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. విరామం లేకుండా వర్షం కురుస్తుండడం జన జీవనం అవస్తవ్యస్తమైంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్.

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. అత్యవసరమైతే తప్ప ఇళ్లలో నుంచి బయటకు రావద్దన్నారు. అధికారులు కూడా క్షేత్రస్థాయిలో ఉంటూ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని చెప్పారు. అత్యవసర సేవల కోసం జీహెచ్ఎంసీలోని కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని సూచించారు. తమ తమ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు అండగా నిలవాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను ఎమ్మెల్యే ఆదేశించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే


డిజాస్టర్ బృంద సభ్యులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమ

చిలకలగూడ : సికింద్రాబాద్ నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షాల ప్రభావంపై ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఆరా తీశారు. ప్రజలంతా మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఐదు డివిజన్లలో మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జీహెచ్ఎంసీ, రెవెన్యూ, విద్యుత్, డిజాస్టర్‌టీం, తదితర విభాగాల సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. దిలా ఉండగా సీతాఫల్‌మండి డివిజన్ షాబాద్ గూడలో భారీ చెట్టు నేలకూలి పార్కింగ్ చేసిన కారుపై పడింది. ఈఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ ఘటనస్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానిక పోలీసులు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందం చెట్టును తొలగించారు.


చెట్ల కొమ్మల తొలగింపు

చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

బౌద్ధనగర్: ఎప్పటికప్పుడు బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్నామని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. భారీ వర్షం కారణంగా బౌద్ధనగర్ డివిజన్‌లోని ఎస్ఎంఆర్ కాంప్లెక్స్ దగ్గర ఇతర ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగాయి. దీంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. స్థానిక కార్పొరేటర్ కంది శైలజ ఘటనా స్థలానికి వెళ్లి సంబంధిత అధికారులకు పిలిపించి విరిగిన చెట్లను తొలగించారు. ఎలక్ట్రికల్ ఏఈ రాము తదితరులు ఉన్నారు.

స్తంభించిన జనజీవనం


లాలాపేట ఇందిరానగర్‌లో నేలకొరిగిన చెట్టు

లాలాపేట: గత రెండు రోజుల నుంచి కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలకు నగర జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. నేలంతా మెత్తగా తయారై భూమిలో నుంచి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ప్రధానంగా తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని లాలాపేట సత్యానగర్‌లో విద్యుత్ స్తంభం విరిగి ఇంటి ముందు పార్క్ చేసి ద్విచక్ర వాహనాలపై పడింది. జమాటో డెలివరీ బాయ్‌కు తృటిలో ప్రాణాపాయం తప్పినట్లు సత్యానగర్ వాసులు తెలిపారు. ఏకధాటిగా వర్షం కురుస్తుండటంతో ప్రజలెవరూ బయట లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. చాలా సేపు ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో తీవ్ర ఆంతరాయం ఏర్పడింది. ఇందిరానగర్‌లో ఓ భారీ చెట్టు వేర్లతో సహా పైకి వచ్చి కూలిపడింది. దీంతో ఇందిరానగర్ ప్రాంతంలో కొంత సేపు రాకపోకలు నిలిచిపోయాయి. దీనిపై స్థానిక ఇందిరానగర్ సంక్షేమ సంఘం అద్యక్షులు నేతికార్ మహేశ్ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగా అధికారులు స్పందించారు. ఎన్‌డిఆర్ఎఫ్, మాన్‌సూన్ బృందాలు, విద్యుత్ అధికారులు సిబ్బంది. సహాయక చర్యలు చేపట్టారు.


లాలాపేట సత్యానగర్‌లో విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

విరిగిపడిన భారీ చెట్టు – ధ్వంసమైన కారు, ఆటో


అడ్డగుట్ట ప్రధాన రహదారిలో కారు, ఆటోలపై విరిగిపడ్డ భారీ చెట్టు


కారుపై పడిన చెట్టును తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

అడ్డగుట్ట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అడ్డగుట్ట, తుకారాంగేట్, లాలాగూడ, శాంతినగర్ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. దీంతో ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ క్రమంలో ఆదివారం వర్షం ధాటికి అడ్డగుట్ట ప్రధాన రహదారిపై భారీ చెట్టు విరిగిపడింది. అదే సమయంలో అక్కడ పార్క్ చేసి ఉన్న కారు, ప్రయాణిస్తున్న ఆటోలపై చెట్టు విరిగిపడడంతో కారు పైభాగం పూర్తిగా ధ్వంసమైంది. ఆ సమయంలో కారులో వచ్చిన వారు టిఫిన్ చేయడానికి పక్కనే ఉన్న హోటల్‌కు వెళ్లడంతో ప్రమాదం తప్పింది. ఆటోలో ఉన్న ప్రయాణికులు అప్రమత్తమై అప్పటికప్పుడు దిగిపోవడంతో అందులో ఉన్న వారికి కూడా ప్రమాదం తప్పింది. తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ బృందాలను పిలిపించి విరిగిపడ్డ చెట్టును తొలగింపజేశారు.

సాయినగర్‌లో మరో చెట్టు....

తుకారాంగేట్‌లోని సాయినగర్‌లో ఆదివారం కురిసిన వర్షానికి ఓ చెట్టు విరిగిపడింది. ఆ సమయంలో బస్తీలో ఎవరూలేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. వర్షం దాటికి చెట్లు విరిగిపడుతున్నాయని, సంబంధిత అధికారులు బస్తీలను సందర్శించి శిథిలావస్థలో ఉన్నటువంటి చెట్లను, కొమ్మలను గుర్తించి ఎటువంటి ప్రమాదాలు జరగక ముందే వాటిని తొలగించాలని కోరుతున్నారు.



సాయినగర్‌లో విరిగిన చెట్టు

ముంపు ప్రాంతాలలో పర్యటించిన కోట నీలిమ



సనత్‌నగర్: భారీ వర్షాల నేపథ్యంలో సనత్‌నగర్ నియోజకవర్గంలోని వరద ముంపు ప్రాంతాలను టీపీసీసీ కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమ ఆదివారం పర్యటించారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని సహాయక చర్యల గురించి అధికారులను విజ్ఞప్తి చేశారు.

నేలకొరిగిన చెట్లు


శ్రీరామ్‌నగర్ కాలనీలో నేలకొరిగిన చెట్టు

అమీర్‌పేట: భారీగా కురుస్తున్న వర్షాలకు తోడు బలమైన గాలులు వీయడంతో అమీర్‌పేటలో పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. ఆదివారం మధ్యాహ్నం అమీర్‌పేట శివ్‌బాగ్ కాలనీలోని భాస్కర ఆసుపత్రి ఎదుట చెట్టు కొమ్మలు విరిగి 11 కేవి విద్యుత్తు తీగలపై పడటంతో ఓ బంచ్ కేబుల్ వైరు తెగి కిందపడిపోయాయి. అనంతరం సిబ్బంది వైర్లపై పడ్డ చెట్ల కొమ్మలను తొలగించి మరమ్మత్తులు చేశారు. బల్కంపేట, బీకేగూడ, శ్రీరామ్‌నగర్, ఎస్ఆర్‌నగర్‌లో సైతం చెట్టు కొమ్మలు విరిగి రోడ్లపై పడిపోయాయి.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి


రసూల్‌పురాలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు ముంపునకు గురికాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సూచించారు. గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా భారీవర్షాలు కురుస్తుండడంతో కంటోన్మెంట్ బోర్డు రసూల్‌పురాలో శ్రీగణేష్ రెవేన్యూ అధికారులతో కలసి ఆదివారం పర్యటించి ప్రజల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసర మైతేనే ప్రజలు బయటికి రావాలని కోరారు. అధికారులు ప్రజలకు అందు బాటులో ఉండాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో విపత్కర పరిస్థితులు ఏర్పడితే కాంగ్రెస్ కార్యకర్తలు సహాయక చర్యల్లో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ ఎమ్మార్వో వినోద్‌కుమార్ మాట్లాడుతూ వర్షాలను దృష్టిలో ఉంచుకుని సహాయక చర్యల్లో పాల్గొనేందుకు ఒక బృందాన్ని అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ తహసిల్దార్ వినోద్‌నాయక్, స్థానిక కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో అధికారులు పర్యటించాలి

చిలకలగూడ : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సికింద్రాబాద్‌లోని పలు లోతట్టు, నాలా పరీవాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, సంబంధిత అధికారులు ఆయా ప్రాంతాలను పర్యటించి సహాయక చర్యలు చేపట్టాలని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా కార్యదర్శి మేకల సారంగపాణి కోరారు. మెట్టుగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో ఆదివారం పర్యటించి ప్రజా సమస్యలను పరిశీలించారు. వరదనీరు ఇళ్లలోకి చేరడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పారిశుధ్య పర్యవేక్షణ లోపంతో ఎటుచూసిన చెత్తచెదారాలు దర్శనమిస్తున్నాయని, సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు వ్యాపించకుండా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు. అంతర్గత రహదారులు అధ్వాన్నంగా మారడంతో పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ రాజేష్‌నాయర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజేష్‌ముదిరాజ్, బీజేవైఎం అధ్యక్షుడు శ్రీనాధ్ ముదిరాజ్, నాయకులు దేవుడుకుమార్, వనమాల శ్రీనివాస్, ఈఎల్ ప్రతాప్, సాయి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం స్వాధీనం

చిలకలగూడ : గుర్తుతెలియని మహిళ మృతదేహం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో లభ్యమైంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన మేరకు.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం 10 వద్ద టిక్కెట్ బుకింగ్ కార్యాలయం సమీపంలో మహిళ మృతదేహం ఉన్నట్లు ఆదివారం అందిన సమాచారం మేరకు పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మహిళ వయసు 45 ఏళ్లు ఉంటాయని, మృతురాలి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు.